క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్టలో మంత్రి రజిని



గుంటూరు రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే దేవుడు హరిహరనాథుడని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. బుధవారం 46వ డివిజన్ రత్నగిరిలో హరిహర్‌క్షేత్ర ధ్వంజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసుపై సమగ్ర దర్యాప్తు చేయాలి

లక్ష్మీపురం: విశాఖ పోర్టులో భారీ మొత్తంలో మాదక ద్రవ్యాల పట్టివేత దేశాన్నే ఉలిక్కి పాటుకు గురి చేసిందని అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా మన నట్టింట దాకా రావడం ఆందోళనకర విషయమని సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విశాఖ డ్రగ్స్ ఉదంతంలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రమేయం ఉందంటూ వస్తున్న వార్తలు బ్లాస్ట్ కావడం కల్లోలం రేపుతున్నాయన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండాశివరామి రెడ్డి, న్యాయవాది అవధానుల హరి, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు, మురళీకృష్ణ, సింగరయ్య ప్రసంగించారు.

అర్చకులపై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: కాకినాడలో అర్చకులపై దాడిచేసిన ఘటన సిగ్గుచేటని బ్రాహ్మణ సామాజిక వర్గం నేతలు బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణ, మల్లేపల్లి హనుమంత శర్మ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని వారి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లో మీడియా అర్చకులపై జరిగిన దాడిని కూడా రాజకీయ రంగు పులమడం దుర్మార్గమన్నారు. అర్చకులపై దాడి చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడాలని డిమాండ్ చేశారు. ఒక ప్రముఖ దినపత్రిక అధినేత కావాలనే ఉద్దేశపూర్వకంగా కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. టీడీపీని అధికారంలోని తెచ్చేందుకు ఆయన తపన పడుతున్నారని, కృష్ణా పుష్కరాల సందర్భంగా ఆధునికీకరణ పేరుతో టీడీపీ నేతలు అనేక దేవాలయాలను కూల్చి వేశారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటే బ్రాహ్మణ సామాజిక వర్గం నడుస్తుందని పేర్కొన్నారు.

4 రోజుల్లో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిదారులకు ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 4 రోజులు మాత్రమే ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ నెలాఖరులోగా తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని సూచించారు. ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందని, బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని కమిషనర్ వివరించారు.

నగదు కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. సంపత్‌నగర్‌కు చెందిన వెంకటరాజేంద్రకుమార్ బుధవారం సాయంత్రం నాజ్‌సెంటర్ వైపు వెళుతున్నాడు. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ద్విచక్రవాహనంలో రూ.76,500 నగదు గుర్తించారు. దానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేయడంతోపాటు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు లారీలు పత్రాలు లేకుండా 60 టన్నుల ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి వాటిని సీజ్ చేశారు.

అధికారులందరూ అందుబాటులో ఉండాలి

కమిషనర్ కీర్తి చేకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించబడిన ప్రతి అధికారి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరికీ కేటాయించిన విధుల మేరకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని మేనేజర్‌ని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో నోడల్, ఇంజినీరింగ్ అధికారులు, సూపరింటెండెంట్‌లతో ఎన్నికల నిర్వహణ, విధుల కేటాయింపుపై ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించబడిన సిబ్బంది ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పూర్తి స్థాయిలో అందుబాటులోనే ఉండాలని కోరారు. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడానికి వీలు లేదన్నారు. కేటాయించిన విధుల మేరకు ప్రతి ఒక్కరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మేనేజర్‌ని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌లకు కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగిన అధికారులను కేటాయించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ రికార్డింగ్ చేసే వీడియో గ్రాఫర్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రికార్డింగ్ చేయాలని, వారి పనిని జె.సెక్షన్ సూపరింటెండెంట్ మోనిటరింగ్ చేయాలని చెప్పారు. ఏఈలు అందరూ ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్‌ల కనెక్షన్‌పై అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణను మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందిస్తామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు తమకు కేటాయించిన విధుల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుని క్షేత్ర స్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, ఎస్ఈ శ్యాం సుందర్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత


చెక్కు అందిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: సహచర కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికంగా చేయూత అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. 2009 బ్యాచ్ కానిస్టేబుల్ ఎం.కిషోర్ గతేడాది డిసెంబర్‌లో మరణించారు. దీంతో ఆ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్స్ అందరూ ఐక్యంగా రూ.2.45 లక్షలు సేకరించారు. ఈ క్రమంలో కిషోర్ భార్య సుధారాణికి ఆ చెక్కుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందించారు. ఆయన మాట్లాడుతూ కిషోర్ కుటుంబానికి పోలీస్ శాఖ అన్నివేళల్లో అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ ఆర్.భాస్కర్, కానిస్టేబుళ్లు ఎం.సాంబశివరావు, సుధాకర్‌రెడ్డి, రవికుమార్, విజయకాంత్, వెంకట్ పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో మెగా జాబ్ మేళా


ఎంపికైన విద్యార్థులు

నగరంపాలెం: విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కలిపించేందుకు మెగా జాబ్‌మేళా నిర్వహించామని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకుని జీవితంలో స్థిరపడాలని టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కె.వి.బ్రహ్మం అన్నారు. టీజేపీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ – ప్లేస్ మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ భాగస్వామ్యంతో బుధవారం మెగా జాబ్‌మేళా చేపట్టారు. ప్రిన్సిపాల్ ఏ.బి.పి.మనోహర్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే భాషా నైపుణ్యాలతో పాటు కంప్యూటర్‌పై అవగాహన ఉండాలని అన్నారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మ్యాజిక్ బస్ డైరెక్టర్ చిలకా మోహన్ మాట్లాడుతూ డిగ్రీ చదివేటప్పుడు విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు. ఏసెన్సర్, మత్తుట్ ఫైనాన్స్, జె.వై సాఫ్ట్‌వేర్, బీఎంఎస్, యునోస్ సర్వీస్, క్యూస్, టెక్రో, వేరెమెరిన్, 24/7 ఏఐ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా, వంద మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైన వారికి నియమాక పత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ అధికారి జి.సురేష్‌బాబు, డాక్టర్ ఎస్.అనితాదేవి, భానుమురళీ, డాక్టర్ జేపీసుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, వరలక్ష్మి, సిహెచ్.మణి, అమూల్య, స్వామి పాల్గొన్నారు.

'అభ్యుదయ'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ (ఐఎల్ఎం–బెంగళూరు) రెండు రౌండ్‌లుగా నిర్వహించగా, తొలి రౌండ్‌లో 67 మంది, రెండో రౌండ్‌లో 40 మంది విజయం సాధించారు. ఈ మేరకు విద్యార్థులకు నియమాక పత్రాలను ఐఎల్ఎం సంస్థ హెచ్ఆర్/ఎ గౌస్‌పాషా, పవన్, కళాశాల యాజమాన్యం నుంచి బీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ రోహిణిదేవి అందజేశారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య


చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న మహిళ

వేజండ్ల (చేబ్రోలు): కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో బుధవారం జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేజండ్ల దళితవాడ ప్రాంతానికి చెందిన వనజారాణి(29)కి, నరసరావుపేట మండలం కోమటివారిపాలెంకు చెందిన వడియాల శరత్ బాబుతో గత నెల 12వ తేదీన వివాహం జరిగింది. గుంటూరు, వడ్లమూడి గ్రామాల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో వనజారాణి ఫార్మాశిస్ట్‌గా పనిచేసేంది. వివాహానంతరం ఇంటి వద్దనే ఉంటున్న వనజారాణి బుధవారం ఉదయం వేజండ్లలోని ఇంటిలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త శరత్‌బాబు రైల్వేగేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి జరిగి రెండు నెలలు కూడా గడవక ముందే కుమార్తె ఆత్మహత్య చేసుకొని మృతి చెందటంతో తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. మృతురాలి తండ్రి వేజండ్ల సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన, నవగ్రహ హోమం, నారాయణ మంత్ర హవనం, యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చూర్ణోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. సాయంత్రం ధ్వజావరోహణ, పుష్పయాగం, పూలంగి సేవ, సప్తవరణ సేవ, పవళింపు సేవ భక్తితో గావించారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేట లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గణపతి పూజ, స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్, రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్



గుంటూరు రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామంలో గోతం సంచిలో మద్యంబాటిల్స్ ఉంచి విక్రయాలకు పాల్పడుతున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా వెంకటరెడ్డి అనే వ్యక్తి వద్దనుంచి 40 క్వార్టర్ బాటిల్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

హరిహరనాథుని ఆలయ ప్రతిష్ఠామహోత్సవంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు


వెంగళాయపాలెం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం 40వ డివిజన్ పెదపలకలూరు రత్నగిరినగర్‌లోగల లక్ష్మీనరసింహ, ఆంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, ముత్యాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బలసాని..

గుంటూరు రూరల్: రంజాన్‌మాస ఎంతో పవిత్ర మాసమని ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షను చేసి అల్లాను స్తుతించి ఆయన కృపను పొందటం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ముస్లింలు ఏర్పాటు చేసిన రంజాన్ పవిత్రమాస ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఉపవాస దీక్షను చేసిన ముస్లింలకు దీక్ష విరమణ అనంతరం వారికి పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ప్రజలంతా సంతోషంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి, కంది సంజీవరెడ్డి, ఎంపీపీ ఇంటూరి పద్మావతి ఆంజిరెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, మిర్చియార్డ్ డైరెక్టర్ ఇంద్ర, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, అబ్దుల్ నబి, కడప వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, డబ్బూరి సూర్యప్రకాశరావు, స్థానిక ముస్లింలు, మత పెద్దలు, ముజావర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్ప్రభావాలు



ప్రత్తిపాడు: బాల్య వివాహాలతో బాలికలు తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదుర్కోవలసి వస్తుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి అన్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో మై చాయిస్ ఫౌండేషన్ సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ సుజాత దేవి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లల మీద తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాతాశిశు మరణాల నివారణలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవ అక్రమ రవాణా అతిపెద్ద సవాలుగా మారిందన్నారు. గృహహింసకు ఆస్కారం లేని కుటుంబాల్లో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలకు తావు ఉండదని చెప్పారు. అప్‌లిఫ్ట్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ తురకా మంగయ్య మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారిని బడికి పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ మాధవి, ల్యాంప్ సంస్థ ట్రైనీ కో–ఆర్డినేటర్లు షేక్ బాజీ, బి.వెంకటేశ్వర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు బుధవారం తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తున్నట్లయితే ఆ నగదును సీజ్ చేస్తామన్నారు. ఒకవేళ అత్యవసరం ఉన్నచో వాటికి సంబంధించి ఆధారాలు ఖచ్చితంగా వెంట తీసుకురావాలని చెప్పారు.

కార్పొరేట్ స్థాయిలో జీజీహెచ్ ప్రసూతి విభాగం


డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ అరుణలకు పత్రాలు అందజేస్తున్న భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ప్రసూతి విభాగంలో భారత పరిశ్రమల సమాఖ్య సహకారంతో రూ.70 లక్షలతో ఆధునికీకరించిన 40 పడకల వార్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రసూతి విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా సిద్ధం చేశారని చెప్పారు. వార్డుకు మూడు టీవీలను సమాకూర్చారు. ఏసీలను పూర్తి స్థాయిలో అమర్చారు. వేసవి కాలంలో తల్లి బిడ్డ హాయిగా ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం సహకారంతో రూపొందించినట్లు వెల్లడించారు.

మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు హాస్యాస్పదం

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు దత్త పుత్రుడు మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుల్లా మేరి కుమారి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబును కలసిన తరువాత మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు ప్యాకేజ్ స్టార్‌కు మించి ఉన్నాయని చెప్పారు. మాదిగలు వైఎస్సార్ సీపీకి ఎందుకు ఓటు వేయాలని, జగన్ మాదిగలను ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా రంగాల్లో మోసం చేశారని వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతుగా ప్రచారం చేస్తామని ప్రకటించి, మరోసారి దళితులను మోసం చేసేందుకు మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఆరోపించారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, రెండు ఎమ్మెల్సీలు, పది కార్పొరేషన్ చైర్మన్‌లు, ఒక ఎంపీ, రెండు జుడీషియల్ పవర్ కలిగిన హ్యూమన్‌రైట్స్, ఆర్టీఏ కమిషన్ పదవులను ఇవ్వడమే కాక, మాదిగ సామాజిక వర్గానికి రెండు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే వర్గీకరణ చేస్తామన్న అంశం ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు సుప్రీం కోర్టులో జరుగుతున్న పరిణామాలకు కృష్ణ మాదిగను అడ్డుపెట్టుకొని చంద్రబాబు లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇక ఆయన ఆటలు సాగవని హెచ్చరించారు.

రంగస్థల నటులకు పురస్కారాలు ప్రదానం


పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ రంగస్థల నటులకు సత్కార సభ నిర్వహించారు. సభకు కళ పత్రిక డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ రఫి అధ్యక్షత వహించారు. అతిథులుగా కళాపోషకులు గంటా పున్నారావు, ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, నాట్యాచార్య కథక్ అంజిబాబు, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, రంగస్థల నటుడు నడింపల్లి వెంకటేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు ఆకురాత్రి భాస్కరచంద్రకు గురజాడ పురస్కారంతో, కత్తి శ్యాంప్రసాద్‌కు బళ్లారి రాఘవ పురస్కారం, డాక్టర్ రాయల్ హరిశ్చంద్రకు సి.యస్.ఆర్. పురస్కారం, షేక్ హుస్సేన్‌కు గరికపాటి రాజారావు పురస్కారం, డాక్టర్ సురభి నిరుపమకు పనారస గోవిందరావు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అనంతరం విజయవాడ హర్ష క్రియేషన్స్ నిర్వహణలో పి.బ్రహ్మానందరావు రచన, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన ట్రీట్‌మెంట్ హాస్యనాటిక ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్ జానీబాషా, డి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.11.51లక్షలు


దాత రావి గీతిక దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ చినవెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో భక్తులచే సమర్పించబడిన హుండీ కానుకలను దేవస్థానంలోని 9 హుండీలను కాజ గ్రూపు దేవాలయాలు, దేవదాయ శాఖ గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారి పి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తెరిచి కానుకలు లెక్కించగా రూ. 11,54,564/- ఆదాయం లభించిందని తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు బుధవారం రూ.1,00,116లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ తెనాలి వాస్తవ్యులు రావి అంకినీడు ప్రసాద్ దంపతుల కుమార్తె రావి గీతిక దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారని తెలిపారు. అనంతరం రావి గీతిక దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన గోపికృష్ణ(27) చేపలు విక్రయిస్తుంటాడు. మొదటి భార్యతో విడిపోయిన అతను పొన్నూరుకు చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవలి కాలంలో వీరి కుటుంబంలో తరచూ ఘర్షణలు జరుగతున్నాయి. ఈ క్రమంలో బుధవారం చినరావూరు స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.20.22 లక్షలు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవస్థానం పాలక మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, పాలక మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారిగా శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం సహాయ కమిషనర్ జి.అమర్‌నాథ్ వ్యవహరించారు. గడచిన 52 రోజులకు గాను రూ.20,22,304లు హుండీ ఆదాయం లభించింది. కొన్ని గ్రాముల బంగారం, వెండి సైతం భక్తులు సమర్పించారు. పాలక మండలి సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెంచుపేట సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.